క్లుప్తంగా

చాముండేశ్వరి అమ్మవారికి పూజలు



చాముండేశ్వరి అమ్మవారిని దర్శించుకుంటున్న భక్తులు

చిలప్‌చెడ్(నర్సాపూర్): మండల పరిధిలోని చిట్కుల్ శివారులో మంజీరా తీరాన వెలసిన చాముండేశ్వరి అమ్మవారిని ఆదివారం భక్తులు దర్శించుకున్నారు. ప్రదక్షిణలు, ఒడిబియ్యం సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు మాట్లాడుతూ, కార్యక్రమంలో భాగంగా అమ్మవారికి ప్రీతికరమైన కుంకుమార్చనలు, ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులకు తీర్థ, ప్రసాదాలు వితరణ చేశామన్నారు.

బీజేపీ ర్యాలీ



నిర్వహించిన ర్యాలీ

కొల్చారం(నర్సాపూర్): బంగ్లాదేశ్‌లో హిందువులపై కొనసాగిస్తున్న మారణకాండను ఆపాలంటూ ఆదివారం పోతంశెట్టిపల్లి శివారులోని ఏడుపాయల టీ– జంక్షన్ నుంచి పోతంశెట్టిపల్లి చౌరస్తా వరకు బీజేపీ ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. పార్టీ మండలాధ్యక్షుడు దయాకర్ గౌడ్ మాట్లాడుతూ రిజర్వేషన్‌లను సాకుగా చూపుతూ హిందువుల దేవాలయపై, వ్యాపార సంస్థలపై దాడులు చేస్తున్నారన్నారు. వ్యక్తులను చంపేందుకు ప్రయత్నించడం దారుణం అన్నారు. ర్యాలీలో జూలకంటి సంగమేశ్వర్, గణపతి, అంజాగౌడ్, శేఖర్‌యాదవ్, మహేశ్, యాదగిరి, భాస్కర్, ప్రదీప్, మహేశ్, శ్రీకాంత్, పవన్, నరేశ్ తదితరులు పాల్గొన్నారు.

పోచమ్మ ఆలయంలో పూజలు



పూజలు చేస్తున్న భక్తులు

కౌడిపల్లి(నర్సాపూర్): కౌడిపల్లి మండలంలోని తునికి నల్లపోచమ్మదేవి ఆలయం ఆదివారం భక్తులు ప్రత్యేక పూజలు చేసి మొక్కులు తీర్చుకున్నారు. ఉదయం దేవాదాయశాఖ ఇన్‌స్పెక్టర్, ఆలయ ఇన్‌చార్జి ఈఓ రంగారావు, జూనియర్ అసిస్టెంట్ వెంకట్‌రెడ్డి ఆధ్వర్యంలో ఆలయ అర్చకులు శివప్ప, రాజేశ్ అమ్మవారికి పంచామృతాలతో అభిషేకం నిర్వహించి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం భక్తులు అమ్మవారిని దర్శించుకుని కుంకుమార్చన చేయించారు. బోనాలు తీసి ఒడి బియ్యం పోసి మొక్కులు తీర్చుకున్నారు. ఆలయం వద్ద డప్పు చప్పుళ్లు, శివసత్తుల పూనకాలు, అమ్మవారి నామస్మరణతో ఆలయ ప్రాంగణం మారుమోగింది. దీంతోపాటు పలువురు భక్తులు తలనీలాలు సమర్పించారు. వాహనాలకు పూజలను కూడా చేయించారు.

ఘనంగా స్వాతి నక్షత్రోత్సవం

సిద్దిపేటరూరల్: పుల్లూరు లక్ష్మీనరసింహ స్వామి క్షేత్రం బండపై నరసింహస్వామి జన్మ నక్షత్రమైన స్వాతీనక్షత్రోత్సవాన్ని ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఆలయంలో పంచకలశ అభిషేకం, సుదర్శన నారసింహ హోమం చేశారు. కార్యక్రమంలో పలు గ్రామాలకు చెందిన భక్తులు పాల్గొన్నారు. అర్చకులు కలకుంట్ల రంగాచార్య, పాడిచేటి శ్రీనివాసాచారి, పాడిచేటి రామకృష్ణ చార్యులు, నశికేత్, సాయి కృష్ణ, మాజీ సర్పంచ్ నరేశ్‌గౌడ్, దేవస్థాన డైరెక్టర్ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

గుంత.. వాహనదారులకు చింత



గుంతలమయంగా మారిన రహదారి

రామాయంపేట(మెదక్): రోడ్డు విస్తరణలో భాగంగా నాలుగు నెలల క్రితం మండలంలోని అక్కన్నపేట వద్ద రోడ్డును తవ్వి వదిలేయడంతో ప్రయాణికులు ఇబ్బంది పడుతున్నారు. మెదక్ నుంచి వరంగల్ జిల్లా ఎల్కతుర్తి వరకు జాతీయ రహదారి నిర్మాణంలో భాగంగా అక్కన్నపేట వద్ద పాత తారు రోడ్డును తవ్వారు. కాగా మిగితా స్థలాల్లో రోడ్డు పనులు కొనసాగుతుండగా.. ఇక్కడ మాత్రం పనులు ప్రారంభించకపోవడంతో గుంతలు తేలిన రహదారితో ప్రయాణికులు ఇబ్బంది పడుతున్నారు. నాలుగు నెలలుగా కాంట్రాక్టర్ పట్టించుకోకపోవడంతో రోడ్డుపై గుంతలు తేలి నీరు నిలిచింది. ముఖ్యంగా రాత్రి సమయంలో ప్రయాణం ప్రమాదకరంగా మారిందని ప్రయాణికులు వాపోయారు. పలువురు గాయపడ్డారని వాపోయారు. వెంటనే తారు రోడ్డు నిర్మాణ పను లు ప్రారంభించాలని కోరుతున్నారు. ఈవిషయమై జాతీయ రహదారుల శాఖ అధికారిని సంప్రదించగా, పెట్రోల్ బంక్ వద్ద నుంచి గ్రామ శివారు మీదుగా బైపాస్ రోడ్డు నిర్మిస్తున్నామని తెలిపారు. దీంతో కొంత ఆలస్యం అవుతుందని పేర్కొన్నారు.

ఆలయ నిర్మాణానికి విరాళం



తుక్యతండాలో ఆలయానికి విరాళం అందజేస్తున్న మాజీ జెడ్పీటీసీ మహేష్‌గుప్తా

శివ్వంపేట(నర్సాపూర్): మండలంలోని తుక్యతండాలో నూతనంగా నిర్మిస్తున్న జగదాంబదేవి, సేవాలాల్ మహరాజ్ ఆలయ నిర్మాణం కోసం మాజీ జెడ్పీటీసీ పబ్బ మహేశ్‌గుప్తా రూ.50వేలు విరాళం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఆలయ నిర్మాణంతో ప్రజల్లో భక్తిభావం ఏర్పడుతుందన్నారు. అందరూ సన్మార్గంలో నడవాలని తెలిపారు. కార్యక్రమంలో నాయకులు రాజేందర్‌నాయక్, రవినాయక్, నరేశ్, పుల్‌సింగ్, ప్రకాశ్, తేజ, నర్సింగ్ తండావాసులు పాల్గొన్నారు.

ఆర్థిక సహాయం

మండల కేంద్రమైన శివ్వంపేటలో ఇటీవల చిన్న భాగ్యమ్మ మృతిచెందగా బాధిత కుటుంబసభ్యులను, అనారోగ్యంతో బాధపడుతున్న కుమ్మరి ముత్యాలు, లస్కరి కుమార్, పుష్పలత, పబ్బ మహేశ్‌గుప్తా పరామర్శించారు. ఒక్కో కుటుంబానికి రూ.5 వేల చొప్పున ఆర్థిక సహాయం అందజేశారు.



పూర్వవిద్యార్థులు సమ్మేళనం

అ'పూర్వ' సమ్మేళనం

కౌడిపల్లి(నర్సాపూర్): మండల కేంద్రమైన కౌడిపల్లి ఉన్నత పాఠశాలలో 2001–02 నాటి పదవ తరగతి చదివిన విద్యార్థులు ఆదివారం పూర్వ విద్యార్థుల సమ్మేళనాన్ని ఘనంగా నిర్వహించారు. ఒకరినొకరు ఆత్మీయంగా పలకరించుకున్నారు. ఆనాటి మధుర జ్ఞాపకాలను గుర్తు చేసుకుని సరదాగా గడిపారు. అనంతరం విద్య నేర్పిన నాటి గురువులు జానకీరాంరెడ్డి, కేరాములు, టీఎస్ ప్రభాకర్, రాంకిషన్, పుండరీ కంగౌడ్, చంద్రకళ, వెంకటేశం, పీడీ శ్రీధర్‌రెడ్డి తదితరులను సన్మానించారు.

రెగ్యులర్ ఈఓను నియమించాలి



మాట్లాడుతున్న భజరంగ్‌దళ్ నాయకుల

పాపన్నపేట (మెదక్): విధుల్లో నిర్లక్ష్యం వహిస్తున్న ఏడుపాయల ఇన్‌చార్జి ఈఓ కృష్ణప్రసాద్‌ను విధుల నుంచి తప్పించి రెగ్యులర్ ఈఓను నియమించాలని భజరంగ్ దళ్ నాయకులు కోరారు. ఆదివారం మాట్లాడుతూ.. భక్తుల సొమ్ము దొంగల పాలైన ఈఓ కనీసం సంఘటనా స్థలికి రాలేదన్నారు. నేరుగా పోలీసులకు సైతం ఫిర్యాదు చేయలేదన్నారు. ఏటా రూ.12 కోట్ల ఆదాయం వచ్చే ఏడుపాయల ఆలయానికి రెగ్యులర్ ఈఓ లేక పోవడం సరికాదన్నారు. సమావేశంలో మండల శాఖ అధ్యక్షుడు బోల కృష్ణ, నాయకులు చరణ్, దుర్గాప్రసాద్, శివదుర్గా ప్రసాద్, రమేష్, శంకర్ తదితరులు పాల్గొన్నారు.

గిరిజనులకు వైద్య పరీక్షలు



వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న డాక్టర్లు

చేగుంట(తూప్రాన్): మండలంలోని చెట్లతిమ్మాయిపల్లి పులిగుట్ట తండాలో ఆదివారం జీఎంఆర్ వరలక్ష్మీ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఈసందర్భంగా గిరిజనులకు సీఎంఆర్ ఆస్పత్రివె వైద్యులు వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు అందించారు. వానాకాలంలో వ్యాపించే వ్యాధుల పట్ల జాగ్రత్తగా ఉండాలని సూచించారు. కార్యక్రమంలో జీఎంఆర్ మేనేజర్ లక్ష్మణరావు, మాజీ సర్పంచ్ మోహన్ రాథోడ్, వైద్యులు వంశీ, వర్ష, కోఆర్డినేటర్ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

ఇదే నిర్లక్ష్యం!

కౌడిపల్లి(నర్సాపూర్): వనమహోత్సవంలో భాగంగా మొక్కలు నాటేందుకు ఏర్పాటు చేసిన వన నర్సరీ అధ్వానంగా తయారైంది. మండలంలోని రాయిలాపూర్ వన నర్సరీలో గత వేసవిలో ఎండవేడిమి నుంచి మొక్కలను రక్షించేందుకు గ్రీన్ నెట్ షెడ్ వేశారు. వర్షాకాలం వచ్చిన తొలగించలేదు. దీంతో గాలి వానకు చిందర వందరగా మారింది. దీనికి తోడు వనసేవక్, ఇతరుల అందులో పశువులను మేపుతుండడంతో మొక్కలకు రక్షణ లేకుండా పోయింది. అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు.



రాయిలాపూర్ వననర్సరీ దుస్థితి

నేడు తహసీల్దార్ కార్యాలయంలో ప్రజావాణి

చిన్నశంకరంపేట(మెదక్): ప్రజా సమస్యల పరిష్కారం కోసం తహసీల్దార్ కార్యాలయంలో ప్రజావాణి కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు చిన్నశంకరంపేట తహసీల్దార్ మన్నన్ తెలిపారు. ఉదయం 10:30 గంటల నుంచి మధ్యాహ్నం వరకు ప్రజల నుంచి వినతులు స్వీకరించనున్నట్లు చెప్పారు.

ఆర్థిక సాయం

రామాయంపేట(మెదక్): రామాయంపేట మండల పరిధిలోని రాయిలాపూర్ గ్రామంలో కొంతల కిష్టయ్య శనివారం రాత్రి మృతి చెందడంతో బాధిత కుటుంబానికి ప్రముఖ సంఘ సేవకుడు గట్టు ప్రశాంత్ ఆదివారం రూ.4000 ఆర్థిక సహాయం అందించారు. కార్యక్రమంలో భూదయ్య, రమేష్, సాల్మాన్, రాములు, బాబు, రామస్వామి, గ్రామస్తులు పాల్గొన్నారు.

ప్రతి ఇంటిపై జాతీయ జెండా



వెల్మకన్నలో గాంధీ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న బీజేపీ నాయకులు

కౌడిపల్లి(నర్సాపూర్): స్వాతంత్య్ర దినోత్సవం రోజు ప్రతి ఇంటిపై జాతీయ జెండా ఎగురవేయాలని బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు రాజేందర్ పిలుపునిచ్చారు. ఆదివారం హర్ ఘర్ తిరంగా కార్యక్రమంలో భాగంగా మండలంలోని వెల్మకన్న, తునికిలో గాంధీ విగ్రహానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ స్వాతంత్య్ర దినోత్సవం నాడు ప్రతి ఇంటిపై జాతీయ జెండా ఎగురవేసి దేశ సమైఖ్యతను చాటాలని కోరారు. కార్యక్రమంలో ఓబీసీ మోర్చా జిల్లా ఉపాధ్యక్షుడు అశోక్, మండల పార్టీ అధ్యక్షుడు రాకేష్, ప్రధాన కార్యదర్శి చల్ల కుమార్, కిసాన్ మోర్చా అధ్యక్షుడు బాలలింగం, మజీ సర్పంచ్ గంగాగౌడ్, రాజు, ఆంజనేయులు, శ్రీనివాస్, ప్రవీన్ తదితరులు పాల్గొన్నారు.

ఉచిత నేత్ర వైద్య శిబిరం

వెల్దుర్తి(తూప్రాన్): వెల్దుర్తి గ్రామ పంచాయతీ కార్యాలయంలో ఆదివారం హైదరాబాద్‌లోని ఓ ప్రైవేట్ ఆసుపత్రి ఆధ్వర్యంలో ఉచిత కంటి వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. ఈసందర్భంగా కంటి సంబంధ వ్యాధులకు సంబంధించి రోగులకు ఉచితంగా మందులు అందజేశారు. సుమారు ఇరవై మందికి శస్త్ర చికిత్స అవసరమున్నట్లు గుర్తించారు.

పథకాలను ప్రజలకు వివరించాలి

కొండపాక(గజ్వేల్): కాంగ్రెస్ పార్టీ మండల వర్కింగ్ ప్రెసిడెంట్‌గా నియామకమైన అంకిరెడ్డిపల్లికి చెందిన గజవెల్లి సుదర్శన్‌కు ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే తూంకుంట నర్సారెడ్డి ఆదివారం నియామక పత్రం అందజేశారు. అనంతరం నర్సారెడ్డి మాట్లాడుతూ పేదల కోసం ప్రభుత్వం పని చేస్తున్న తీరు, అమలు చేస్తున్న పథకాల గురించి ప్రజలకు వివరించాలన్నారు. పార్టీ పటిష్టత కోసం పనిచేసే వారిని గుర్తింపు ఉంటుందని చెప్పారు.



రక్తదాన శిబిరానికి సంబంధించిన కరపత్రాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే సునీతారెడ్డి

ఆలయాలు ప్రశాంతతకు నిలయాలు

ఎమ్మెల్యే సునీతారెడ్డి

వెల్దుర్తి(తూప్రాన్): ఆలయాలు మానసిక ప్రశాంతతకు నిలయాలని, ప్రతి ఒక్కరూ దైవచింతన అలవర్చుకోవాలని ఎమ్మెల్యే సునీతారెడ్డి అన్నారు. మండలంలోని ఎం.జలాల్‌పూర్ కాళికామాత దేవాలయం వద్ద ఆదివారం బోనాల ఉత్సవాలు నిర్వహించారు. వేడుకల్లో ఎమ్మెల్యే సునీతారెడ్డి పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అమ్మవారి దయవల్ల పాడి, పంటలతో నియోజకవర్గ ప్రజలంతా సుఖ, సంతోషాలతో వర్ధిల్లాలని వేడుకున్నారు. అనంతరం వెల్దుర్తి పట్టణంలో ఏర్పాటుచేసిన ఓ ప్రైవేట్ మాల్‌ను ప్రారంభించారు. ఈనెల 15న వాకిటి లక్ష్మారెడ్డి వర్ధంతి సందర్భంగా నర్సాపూర్‌లో నిర్వహించే రక్తదాన శిబిరానికి సంబంధించిన కరపత్రాన్ని ఆవిష్కరించారు. కార్యక్రమంలో మాజీ జెడ్పీటీసీ రమేశ్‌గౌడ్, సర్పంచ్‌ల ఫోరం మండల మాజీ అధ్యక్షుడు అశోక్‌రెడ్డి, నాయకులు కోదండ కృష్ణాగౌడ్, నర్సింలు, భూపాల్‌రెడ్డి, అశోక్‌గౌడ్, శ్రవణ్‌కుమార్, సత్యంగౌడ్ పాల్గొన్నారు.

సమస్యలను పరిష్కరిస్తా



పూజలో ఎమ్మెల్యే ప్రభాకర్‌రెడ్డి నాయకులు

చేగుంట(తూప్రాన్): మండల కేంద్రమైన చేగుంటలో ఆదివారం వడియారం మాజీ ఎంపీటీసీ లక్ష్మీ రమేశ్ నిర్వహించిన నూతన గృహ పూజ కార్యక్రమంలో దుబ్బాక ఎమ్మెల్యే ప్రభాకర్‌రెడ్డి పాల్గొన్నారు. గ్రామాల్లోని సమస్యలను ఎన్నటికప్పుడు తెలియజేయాలని నాయకులకు సూచించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ మండలశాఖ అధ్యక్షుడు నారాయణరెడ్డి, నాయకులు జీవన్‌రెడ్డి, అలీ, సత్యనారాయణ, మెడికల్ రాజు పాల్గొన్నారు.

సీఎంఆర్‌ఎఫ్ చెక్కుల పంపిణీ



చెక్కులను పంపిణీ చేస్తున్న మాజీ సర్పంచ్ మహేశ్వరీ

చిన్నశంకరంపేట(మెదక్): నార్సింగి మండలంలోని వల్లూర్‌లో దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి సహకారంతో మంజూరైన సీఎంఆర్‌ఎఫ్ చెక్కులను మాజీ సర్పంచ్ మహేశ్వరీ ఆదివారం పంపిణీ చేశారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల నాయకులు చిందం రవీందర్, మాజీ సర్పంచ్ నర్సింహులు, బీఆర్ఎస్ గ్రామ అధ్యక్షుడు అబ్దుల్ వాహిద్, నాయకులు నాగులు, మహేష్, సరేష్, ప్రవీణ్, గణేష్ తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ పాలనలో ప్రజలకు కష్టాలే

- పేరుకుపోయిన చెత్తాచెదారాలు
- ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి



చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే తదితరులు

దుబ్బాక: మాయ మాటలుచెప్పి అధికారంలోకి వచ్చిన ఎనిమిది నెలల కాంగ్రెస్ పాలనలో ప్రజలు అష్టకష్టాలు పడుతున్నారని ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్ రెడ్డి అన్నారు. తన క్యాంపు కార్యాలయంలో 300 బాధిత కుటుంబాలకు రూ.80లక్షల విలువజేసే ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కులను ఆయన ఆదివారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కరువు ఛాయలు కమ్ముకున్నా ప్రభుత్వానికి సోయి లేదన్నారు. నెల రోజులుగా గోదావరి, కృష్ణా జలాలు సముద్రం పాలవుతున్నా పట్టించుకోవడం లేదని వాపోయారు. గతయేడాది సమయానికల్లా వాగులు, చెరువులు, కుంటల్లోకి గోదారిజలాలు విడిచిపెట్టామని చెప్పారు. బీఆర్ఎస్ ఒత్తిడి మేరకే రెండు రోజుల క్రితమే మల్లన్న సాగర్, కొండపోచమ్మ సాగర్ నుంచి నీళ్లు వదిలారని, గతేడాది 1.70లక్షల ఎకరాల్లో వరి సాగు పూర్తవగా ఇప్పుడు కేవలం 25వేల ఎకరాల్లో మాత్రమే సాగు పూర్తయిందని చెప్పారు. పట్టణాలు, గ్రామాలు చెత్తచెదారంతో నిండిపోయాయని ఎక్కడ చూసినా దుర్గంధం వెదజల్లడంతో ప్రజలు జ్వరాల భారిన పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. రోడ్లకు మరమ్మతులు చేయకపోవడంతో ప్రజలు నిరసన తెలుపుతున్నారని చెప్పారు. ఇప్పటికైనా ప్రభుత్వం మొద్దునిద్ర వదిలి పాలనపై దృష్టి పెట్టాలని సూచించారు. ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య, మున్సిపల్ చైర్‌పర్సన్ గన్నె వనిత భూంరెడ్డి, బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు రాజమౌళి, కడతల రవీందర్‌రెడ్డి, ఎల్లారెడ్డి, కౌన్సిలర్లు పాల్గొన్నారు.

బ్రహ్మోత్సవాలకు రండి..

దుబ్బాక బాలాజీ ఆలయ బ్రహ్మోత్సవాలు 13నుంచి ప్రారంభమవుతున్న నేపథ్యంలో ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి, రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్యలకు ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ఆహ్వానపత్రికను అందజేశారు.

చెట్ల నరికివేతకు యత్నం

అడ్డుకున్న యువకులు



వదలి వెళ్లిన కలప

మద్దూరు(హుస్నాబాద్): పాఠశాలల్లోని చెట్లలను నరికివేస్తుండగా గ్రామానికి చెందిన యువకులు అడ్డుకున్న ఘటన దూల్మిట్ట మండలంలోని బైరాన్‌పల్లిలోని ప్రాథమిక పాఠశాలల్లో ఆదివారం చోటు చేసుకుంది. గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం గ్రామంలోని ప్రాథమిక పాఠశాలల్లో కొన్నేండ్లుగా ఉన్న సుబాబు చెట్లను సెలువు రోజున గుట్టుచప్పుడు కాకుండా అక్రమంగా నరికి సొమ్ము చేసుకునేందుకు గ్రామానికి చెందిన ఓ కలప వ్యాపారి ప్రత్నించాడు. దీంతో కొంతమంది యువకులు అడ్డుకున్నారు. ప్రధానోపాధ్యాయుడు అనుమతి తీసుకున్నానని ఆ వ్యాపారి యువకులకు చెప్పాడు. ఆయినా యువకులు వాగ్వాదానికి దిగడంతో ఆ వ్యాపారి కలపను అక్కడే వదిలేసి వెళ్లిపోయాడు. పాఠశాలల్లో పచ్చదనాన్ని కాపాడల్సింది పోయి చెట్లను నరకడం ఎంతవరకు సమంజసమని యువకులు ప్రశ్నిస్తున్నారు. బాధ్యులపై అధికారులు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈవిషయంపై హెచ్ఎం లక్ష్మారెడ్డిని వివరణ కోరగా తన అనుమతి కోసం ఆ వ్యాపారి ప్రయత్నించినప్పటికీ తాను ఒప్పుకోలేదని చెప్పారు.



బోనాలు సమర్పించేందుకు వస్తున్న గ్రామస్తులు

ఘనంగా బోనాల జాతర

మండలంలోని ఆదర్శ గ్రామం మల్కాపూర్‌లో బోనాల జాతరను ఆదివారం ఘనంగా జరుపుకున్నారు. శివసత్తుల పూనకాలు, పోతరాజుల విన్యాసాలతో అమ్మవారికి సమర్పించారు. దీంతో గ్రామంలో పండగ వాతావరణం చోటు చేసుకుంది. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ మహాదేవి, ఎంపీటీసీ వెంకటమ్మ, మాజీ ఉపసర్పంచ్ ఆంజనేయులుగౌడ్, గ్రామస్తులు పాల్గొన్నారు. తూప్రాన్



అల్లాపూర్‌లో పీర్ల సందడి

భక్తిశ్రద్ధలతో పీర్ల పండగ

కులమతాలకు అతీతంగా పీర్ల పండుగను మూడు రోజుల పాటు గ్రామస్తులు కలిసికట్టుగా నిర్వహించడం అనవాయితీగా వస్తోంది. మున్సిపల్ పరిధిలోని 7వ వార్డు అల్లాపూర్‌లో పీర్ల పండుగను అన్ని పండుగలకు భిన్నంగా నిర్వహించుకోవడం విశేషం. ఆదివారం పీర్లను ప్రధాన వీధుల గుండా ఊరేగించారు. మున్సిపల్ కౌన్సిలర్ భగవన్‌రెడ్డి, గ్రామస్తులు పాల్గొని పీర్లకు పూజలు నిర్వహించారు. తూప్రాన్